క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని రాజాగారివీధి, మల్లికార్జునపురం పట్టణ ఆరోగ్య కేంద్రాలను జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల టీబీ కేసులు పెరుగుతున్నాయని, వీటి నివారణకు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలన్నారు. రెండు వారాలుగా దగ్గు, బరువు తగ్గడం, జ్వరం లాంటి లక్షణాలుంటే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు సిటీ : నారాయణరెడ్డిపేటలోని విశ్వ జనని అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రయంలో డాక్టర్ కిశోర్స్ రత్నం స్కూల్ విద్యార్థులు సోమవారం నిత్యావసర సరుకులను వితరణ చేశారు. కార్యక్రమంలో కె.కృష్ణకిశోర్, వాసంతి కిశోర్, రోషిణి, పాఠశాల ప్రిన్సిపాల్ కల్యాణి, మేనేజర్ రాజేష్‌బాబు పాల్గొన్నారు.

వినికిడి యంత్రం పంపిణీ



నెల్లూరు రూరల్ : నగరంలోని కొరడా వీధిలో వినికిడి లోపంతో బాధపడుతున్న షేక్.ఖలీల్‌కు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో వినికిడి యంత్రాన్ని సోమవారం అందజేశారు. రాజేంద్రనగర్ కుక్కలగుంటలోని బీజేపీ కార్యాలయంలో సుమారు రూ.25 వేల విలువ చేసే వినికిడి యంత్రాన్ని అందించారు. బీజేపీ నేతలు ఖాదర్, పెంచలయ్య, హేమంత్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఆర్డీఓ పరిశీలన

నెల్లూరు సిటీ : రూరల్ మండలంలోని ఆమంచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని ఆర్డీఓ అనూష సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను సరిచూశారు. ఏపీఐఐసీ, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్



చిన్నారుల నృత్యరూపకం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని బాప్టిస్టు చర్చి డానీహాల్లో ప్రీ క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ కె.శ్యాంసన్ వాక్యోపదేశం చేశారు. సండే స్కూల్ పిల్లలు సంగీత, నృత్య రూపకాలతో అలరించారు. అనంతరం రెవరెండ్ కె.శ్యాంసన్, రెవరెండ్ హుల్దాశ్యాంసన్ దంపతులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చైర్మన్ డి.సురేంద్ర, సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, సండే స్కూల్ సూపరింటెండెంట్ నివేదిత, క్వైర్ డైరెక్టర్ బిల్లీశ్యాంసన్, అనితారాయ్, సంధ్యా, జ్యోతి జయకుమార్, కృపారాజన్, కృపాల్, వరప్రసాద్, జానీజో, మహేష్, సంజయ్ పాల్గొన్నారు.

జోనల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



వ్యాచరచన పోటీలో ప్రథమ బహుమతి అందుకుంటున్న సుచిత్ర

నెల్లూరు (టౌన్) : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గుంటూరులో సోమవారం జోనల్ స్థాయిలో జరిగిన వివిధ పోటీల్లో నెల్లూరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. డిబెట్ విభాగంలో సీటీనగర్‌కు చెందిన ప్రవీణ్, విష్ణువర్ధన్‌లు ప్రథమ స్థానం, వ్యాసరచన పోటీల్లో గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సుచిత్ర ప్రథమ స్థానం, వక్తృత్వ పోటీల్లో చెన్నపల్లిపాళెం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన బి.లాలస ద్వితీయ స్థానం, దేశభక్తి గీతాల పోటీలో గండవరం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సుచిత్ర తృతీయస్థానం సాధించి బహుమతులను అందుకున్నారు. ఈ సందర్భంగా డీఈఓ బాలాజీరావు, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, గైడ్ టీచర్లు ఫణికుమార్, కట్టా సురేష్, పుల్లయ్య, ఖాదర్‌బాషా అభినందనలు తెలిపారు.

28న బ్రాహ్మణ వనసమారాధన

నెల్లూరు(బృందావనం) : ఈనెల 28న బ్రాహ్మణ వనసమారాధన మహోత్సవం జరుగనుందని తిక్కన మహాకవి లలిత కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆలూరు శిరోమణిశర్మ సోమవారం తెలిపారు. నగరానికి సమీపంలోని తిక్కవరప్పాడు రాజరాజేశ్వరి ఆలయం, నాగేంద్రస్వామి ఆశ్రమంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

ట్రాఫికర్‌కు చెక్

- నగరంలోని ఏడు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్
- తొలివిడతగా మూడు ప్రాంతాల్లో ఏర్పాటు

ఓ వైపు నగర విస్తరణ, మరోవైపు పెరుగుతున్న జనాభా ఫలితంగా జిల్లా కేంద్రమైన నెల్లూరులో ట్రాఫిక్ సమస్య జటిలంగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో నగరంలోని ప్రధాన కూడళ్లలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి హారన్ల సౌండ్స్‌లో మోతమోగిపోతుంది. దీనిని పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.



కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద నిరుపయోగంగా ఉన్న సిగ్నల్ పాయింట్

నెల్లూరు(క్రైమ్) : జంక్షన్లు, రద్దీ ప్రాంతాల్లో వాహనాల క్రమబద్ధీకరణకు సిగ్నలింగ్ వ్యవస్థ ఎంతగానో దోహదపడుతోంది. అయితే నెల్లూరు నగరంలో వీటి ఏర్పాటులో జాప్యం జరుగుతూనే ఉంది. ఫలితంగా నగరవాసులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎస్పీ జి.కృష్ణకాంత్, నగర కమిషనర్ సూర్యతేజ ట్రాఫిక్ నియంత్రణకు పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. రూ.1.39 కోట్లతో నగరంలోని కనకమహల్ సెంటర్, వీఆర్సీ, ఏసీ కూరగాయాల మార్కెట్, రామలింగాపురం జంక్షన్, హరనాథపురం జంక్షన్, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీసు కార్యాలయ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌పీటీ నెట్‌వర్క్స్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ సంస్థ రెండేళ్ల పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ నిర్వహణ బాధ్యతలను నిర్వహిస్తాయి.

రెండు విడతల్లో..

తొలి విడతగా నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, కేవీఆర్ పెట్రోల్ బంక్, కనకమహల్‌సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తారు. తరువాత రెండో విడతగా జిల్లా పోలీసు కార్యాలయ కూడలి, హరనాథపురం, రామలింగాపురం జంక్షన్‌లు, వీఆర్సీ సెంటర్‌లలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. మరో రెండు నెలల్లో రెండు దశల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటుగా ట్రాఫిక్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. వీటన్నింటినీ కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేస్తారు. రద్దీగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటుగా స్థానిక పోలీసులు విధులు నిర్వహిస్తారు. ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో పూర్తిగా ఎల్లో సిగ్నల్స్ వేసి ఉంటుంది. ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది ఆ ప్రాంత పోలీసు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా చర్యలు చేపడుతారు. మరోవైపు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్సింగ్ సిస్టమ్ ద్వారా నిబంధనల అతిక్రమించేవారిని హెచ్చరించడంతో పాటుగా, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించనున్నారు.

రెండు నెలల్లో ఏర్పాటు



నెల్లూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాం. నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సహకారంతో ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. దీంతో ట్రాఫిక్ మెరుగుపడనుంది.

– జి.కృష్ణకాంత్

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : అల్పపీడన ప్రభావంతో నగరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. నెల్లూరు మున్సిపల్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జీదారుల నుంచి కమిషనర్ వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపై, లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల్లోకి చేరకుండా అవసరమైన అన్నిచర్యలు చేపట్టేందుకు ముందస్తు చర్యలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో నగర వ్యాప్తంగా కాలువల పూడికతీత చేపట్టాలన్నారు. మురుగునీటి కాలువలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను తొలగిస్తామని తెలియజేశారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా నిర్ణీత సమయంలో పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ కృష్ణకిశోర్‌తో పాటు అన్నివిభాగాలకు చెందిన సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి నిర్లక్ష్యం.. సంస్థకు నష్టం



ఒరిగిన విద్యుత్ స్తంభం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి గంటల కొద్దీ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. అంతేకాకుండా సంస్థకు నష్టాన్ని కలిగించింది. నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీ ప్రాంతానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణం కోసం తన స్థలంలో సోమవారం ఉన్న కొబ్బరిచెట్టును నరికే సమయంలో పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లపై పడింది. దీంతో లైన్లు ఎక్కడికక్కడ తెగిపోవడంతో పాటు, విద్యుత్ స్తంభం కూడా ఒరిగింది. దీంతో ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ లైన్ల పక్కనే ఉన్న చెట్టును కొట్టే సమయంలో ముందుగా విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. అయితే సదరు వ్యక్తి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురికావడంతో పాటు, విద్యుత్ సిబ్బందికి నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నెల్లూరు విద్యార్థిని



మానసను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఫత్తేఖాన్‌పేటలోని నగరపాలక ఉన్నత పాఠశాల (రామయ్యబడి)కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎస్.మానస ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం వేదమూర్తి తెలిపారు. నగరంలోని రామయ్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మానసను సోమవారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22 నుంచి చిత్తూరు జిల్లాలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండర్–14 కేటగిరి రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎస్.మానస, కె.శరణ్య, కె.పూజిత, ఎస్.సుశాంత్‌కిరణ్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారన్నారు. వారిలో ఎస్.మానస జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన పీడీ వెంకట్రావును అభినందించారు.

యోగా పోటీల్లో నెల్లూరీయుల ప్రతిభ



ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఈనెల 24న తమిళనాడు స్పోర్ట్స్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ యోగా పోటీల్లో నెల్లూరీయులు ప్రతిభ కనపరిచినట్లు యోగా గురువు ప్రసన్నకుమార్ సోమవారం తెలిపారు. 12–14 సంవత్సరాల కామన్ కేటగిరిలో శ్రీకీర్తి మూడో స్థానం, 36–45 సంవత్సరాల కేటగిరిలో జి.రేవతి ద్వితీయ స్థానం, 46–55 సంవత్సరాల కేటగిరిలో ఏవీ ప్రసన్నకుమార్ మొదటి స్థానం, 56 ఏళ్లు దాటిన కేటగిరిలో బి.రఘురామయ్య ద్వితీయ స్థానం సాధించారన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను యోగా అసోసియేషన్ సభ్యులు, యోగా మాస్టర్‌లు అభినందించారు.

ఏఆర్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



ఎస్పీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న చంద్రమోహన్

నెల్లూరు(క్రైమ్) : నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా ఎస్.చంద్రమోహన్ సోమవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విడవలూరుకు చెందిన చంద్రమోహన్ 1992లో ఆర్‌ఎస్సైగా పోలీస్‌శాఖలో బాధ్యతలు చేపట్టారు. 2008లో ఆర్‌ఐగా పదోన్నతి పొంది విశాఖ రూరల్, ఒంగోలు, నెల్లూరు వెల్ఫేర్, విజయవాడ సిటీల్లో పనిచేశారు. 2022లో పదోన్నతి పొంది నెల్లూరు హోంగార్డు డీఎస్పీగా, బాపట్ల ఏఆర్‌డీఎస్పీగా పనిచేశారు. ఇటీవలి బదిలీల్లో నెల్లూరు ఏఆర్ డీఎస్పీగా పనిచేస్తున్న పి.వెంకటేశ్వరరావు జెన్కోకు బదిలీ కాగా ఆయన స్థానంలో చంద్రమోహన్ నియమితులయ్యారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న డాక్టర్ రీనాభారతి

నెల్లూరు(అర్బన్) : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్పుడే మానవ మనుగడ సాధ్యమని వెంగళరావు నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రీనాభారతి అన్నారు. నగరంలోని తాతయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో అమ్మపేరుతో ఒక మొక్క అనే కార్యక్రమాన్ని నెహ్రూ యువకేంద్రం, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటారు. అనంతరం డాక్టర్ రీనాభారతి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రధాని నరేంద్రమోదీ అమ్మపేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి, పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, రూడ్స్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, హెచ్‌ఎం భూషణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నెల్లూరు రూరల్ : ఆశ్రమం పేరిట ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్న రామదూత స్వామిపై చర్యలు తీసుకోవాలని భారత హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గూడూరు మండలం చేవూరులో ఆశ్రమం పేరుతో రామదూత స్వామి ఆక్రమించిన దాదాపు 15 ఎకరాలు చెరువు పోరంబోకు, అసైన్డ్ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు.

మ్యాపింగ్ చేయించుకోండి

నెల్లూరు(బారకాసు) : సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న హౌస్ హోల్డ్ సర్వేలో తమ ఇంటిని మ్యాపింగ్ చేయించుకోవాలని కమిషనర్ సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలతో పాటు సచివాలయాల్లో సాధారణ సేవలు పొందవచ్చని తెలియజేశారు.

సేవా సుప్రీమ్ సంస్థను రద్దు చేయాలి

నెల్లూరు(అర్బన్) : కార్మికుల సొమ్మును మింగేస్తున్న సేవా సుప్రీమ్ అనే అవుట్ సోర్సింగ్ సంస్థ గుర్తింపును రద్దు చేయాలని టీయూసీసీ జిల్లా కార్యదర్శి పి.లీలామోహన్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ గురుకులాల్లో సూపర్‌వైజర్లకు ప్రభుత్వం రూ.16 వేలు, సెక్యూరిటీ గార్డులకు రూ.13,500 చెల్లిస్తోందన్నారు. దీనికి ఏజెన్సీ తీసుకున్న సేవా సుప్రీమ్ సంస్థ సెక్యూరిటీ గార్డులకు రూ.6,500, సూపర్‌వైజర్లకు రూ.9 వేలను మాత్రమే చెల్లిస్తోందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని 28న డీసీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ పాశం నరసింహారావు, కరీముల్లా, సమద్, అల్తాఫ్, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

నెల్లూరు(అర్బన్) : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు పలు సమస్యలపై అర్జీలు అందించి పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ ఆనంద్ వాటిని స్వీకరించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వాటిల్లో కొన్ని ఇలా ఉన్నాయి. బుజబుజనెల్లూరులోని భగత్‌సింగ్ కాలనీ ఏ–బ్లాకు, బీ–బ్లాకులలోని పలు వీధులకు రోడ్లు వేసి సైడు కాలువలు నిర్మించాలని డీవైఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. ఈమేరకు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సైడు కాలువలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లో ప్రవహిస్తోందన్నారు. ఫలితంగా ప్రజలకు తగాదాలు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కొండా ప్రసాద్, కృష్ణమూర్తి, రమణయ్య పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి అడ్డుపడుతున్నారు

నెల్లూరు రూరల్ : ఇంటి ప్రహరీ కూలితే తిరిగి నిర్మించుకోకుండా కొందరు అడ్డుపడుతున్నారని బీజేపీ నేత మిడతల రమేష్ సోమవారం కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఊటుకూరులో 20 ఏళ్లుగా సీతారావమ్మ, సులోచనమ్మ నివాసం ఉంటున్నారన్నారు. వారికి సంబంధించిన ఇంటి ప్రహరీ ఇటీవలి వర్షాలకు కూలిపోయిందని, దీనిని నిర్మించుకుంటుంటే శ్మశాన స్థలం అంటూ కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వర్‌ను వేగవంతం చేయాలి

నెల్లూరు రూరల్ : ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులు డౌన్‌లోడ్ కావడం లేదని, సర్వర్‌ను వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారి వెంట పార్టీ నేతలు సురేష్‌రాములు, సుందర్ రజన్, శివ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



నెల్లూరు సిటీ : లింగ వివక్షకు వ్యతిరేకంగా రూరల్ మండల సమాఖ్య కార్యాలయం నుంచి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శైలేంద్రకుమార్ మాట్లాడుతూ లింగ వివక్షకు వ్యతిరేకంగా డిసెంబర్ 23 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రూరల్ ఏపీఎం రోజ్‌మేరీ, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, సీసీలు రమణయ్య, వెంకటరత్నం, మంజుల పాల్గొన్నారు.

సర్వం.. శివోహం



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన చేస్తున్న మహిళలు



- ఆది దంపతులకు ప్రణమిల్లిన భక్తజనం

నెల్లూరు(బృందావనం) : కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని సింహపురిలోని పరమేశ్వరుని కొలువులకు భక్తులు పోటెత్తారు. నగరంలోని వివిధ రూపాల్లో కొలువైన పార్వతీ పరమేశ్వరులకు అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ఏకాదశ రుద్రహోమాలు, క్షీరాభిషేకాలు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, విశేష పూజలు జరిపారు.

➡ మూలాపేటలోని మూలస్థానేశ్వరస్వామికి ఉదయం పుష్పాభిషేకం, రాత్రి ప్రాకారోత్సవం కనుల పండువగా నిర్వహించారు. నవాబుపేటలోని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం, మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వర స్వామి, సంతపేట ములుముడి బస్టాండ్ వద్ద ఉన్న హరిహరనాథస్వామి, వేదాయపాళెంలోని మల్లికార్జునస్వామి, మూలాపేటలోని నీలకంఠేశ్వర స్వామి, క్రాంతినగర్‌లోని శివకేశవుల ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువైన స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

➡ బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా బొమ్మిశెట్టి మురళీకృష్ణ– సునంద దంపతులు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం కమిటీ నిర్వాహకులు తాతా కిశోర్, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కె.శివప్రసాద్, అమర మోహన్‌రావు పర్యవేక్షించారు.

➡ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో మీనాక్షీసుందరేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, అనంతరం అన్నాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు దీపారాధన చేసి, ఉపవాస దీక్షలు విరమించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.



బాలాజీనగర్‌లో శివపార్వతుల కల్యాణం



రాజరాజేశ్వరి సన్నిధిలో దీపారాధన



మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో విశేషాలంకరణ

నేత్రపర్వంగా పడిపూజ



శీవేలి ఉత్సవం



పడి పూజ చేస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో మండల పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి పడిపూజ, సహస్ర దీపోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మండల పూజల ఉభయకర్తలుగా పి.అంకయ్య– సరస్వతి, పావళ్ల ప్రసాద్– మాధవి, కడప ప్రభాకర్– పెంచలమ్మ, అన్నప్రసాద ఉభయకర్తలుగా ఎనమల యువకృష్ణ– స్రవంతి, సహస్ర దీపోత్సవానికి విజయకుమార్‌రెడ్డి– మల్లీశ్వరి, పడిపూజకు వరదిరెడ్డి నవీన్‌రెడ్డి– చాంద్విని దంపతులు వ్యవహరించారు. గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు పాల్గొన్నారు.